క్లుప్తంగా

నేడు వయోజన విద్యపై శిక్షణ

లింగాల : మండల కేంద్రమైన లింగాల ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం వయోజన విద్యపై అధికారులకు ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని సీపీడీఓ శ్రీలత పేర్కొన్నారు. మండలంలోని అన్ని సచివాలయాల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఈ శిక్షణా తరగతులకు హాజరు కావాలని కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

వేంపల్లి: మండలంలోని కత్తులూరు పంచాయతీలోని తాటిమాకులపల్లె గ్రామంలోని కోదండరామ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం గణపతి పూజా, కలశ స్థాపన, పుణ్యాహవాచనము కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు అంకురారోహణ, దీక్షా హోమం, మహా మంగళ హారతి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 12వ తేదీన సీతారాముల విగ్రహాలను గ్రామంలో ఊరేగిస్తామని తెలిపారు. 13వ తేదీన ఉదయం విగ్రహ ప్రతిష్ట అనంతరం సీతారాముల కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

15న కోటి దీపోత్సవం



నగలగుట్టపల్లె వద్ద వెలసిన దశరథ ఆలయం

చక్రాయపేట: మండలంలోని సురభి గ్రామం నాగలగుట్టపల్లె సమీపంలో వెలసిన కౌసల్య, సుమిత్ర, కైకేయి సమేత దశరథ మహారాజు ఆలయంలో ఈ నెల 15న కార్తీక కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు దశరథ, సుబ్బరామయ్య తెలిపారు. 15న ఉదయం వాల్మీకి రామాయణం పఠనం, ఆధ్యాత్మిక ప్రవచనం, సుమంగలి పూజ, స్వామి వారి కల్యాణం, ఆకాశదీపం, కార్తీక కోటి దీపోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురంలో సోమవారం తాడిపత్రి నుంచి పులివెందులకు వెళుతున్న ఆర్టీసీ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఎదురుగా వస్తున్న కారును ఆర్టీసీ డ్రైవర్ తప్పించబోయే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో ప్రయాణీకులు ఊపిరిపీల్చుకున్నారు.

నాటు సారాను నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న తహసీల్దార్ నజీర్ అహ్మద్

పులివెందుల రూరల్ : నాటుసారా, అక్రమ మద్యాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పులివెందుల పట్టణంలో నగరిగుట్ట సమీపంలో నాటు సారా, అక్రమ మద్యాన్ని నిర్మూలిద్దాం – సారాలేని గ్రామాలు ప్రగతి మార్గాలు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుత కంప్యూటర్ కాలంలో ప్రతి ఒక్కరూ ఉన్నతమైన చదువులు చదువుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఐ విష్ణు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

మైలవరం: ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించడమే ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ లక్ష్యమని బ్యాంక్ మేనేజర్ ఉదయ్ చంద్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని దన్నవాడ గ్రామంలో గ్రామీణ ప్రాంత రైతులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈఎంఆర్ రూరల్ ఫోక్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ కళాజాత బృందంతో బ్యాంక్ నుంచి ప్రజలకు అందుతున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ బృందం వెంకటేష్, మహేష్, క్యాషియర్ వెంకట సుబ్బయ్య, ప్రజలు పాల్గొన్నారు.

పంటల బీమా రైతులే చెల్లించాలి

పెద్దముడియం: ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసే పంటలకు రైతులే బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ యూనిట్‌గా పప్పు శనగ, మండల యూనిట్‌గా వరి, జొన్న, మినుము, జిల్లా యూనిట్‌గా వేరు శనగ, ఉల్లి పంటల దిగుబడి ఆధారిత పంటల బీమాలో ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. పంటలు సాగు చేసిన రైతులు స్వచ్ఛందంగా పంట రుణాలు పొందిన బ్యాంకుల్లో డిసెంబర్ 15వ తేదీ లోపు ప్రీమియం చెల్లించవచ్చని పేర్కొన్నారు. అయితే వరి పంట సాగు చేసిన రైతులకు డిసెంబర్ 30వ తేదీ వరకు ప్రీమియం చెల్లింపు గడువు ఉందన్నారు.

బడి వంటకు.. ధరల మంట

విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి నిత్యావసర ధరల పెరుగుదల శరాఘాతంగా మారింది. పెరుగుతున్న ధరలకు తగ్గట్టు ప్రభుత్వం బడ్జెట్ పెంచడం లేదు. దీంతో విద్యార్థులు అందిస్తున్న భోజనంలో నాణ్యత తగ్గుతోంది. పౌష్టికాహారం అందక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

- భారంగా మధ్యాహ్న భోజన పథకం
- మండుతున్న నిత్యావసర ధరలు
- ఇప్పటికీ పాత మెనూ ధరలే
- విద్యార్థులకు అందని పౌష్టికాహారం



యర్రగుంట్ల ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని విద్యార్థులకు వడ్డిస్తున్న నిర్వాహకులు

ఎర్రగుంట్ల : సామాన్య మధ్య తరగతి ప్రజలతో పాటు పాఠశాలలకు కూడా ధరల మంట తగులుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేసి, మనబడి–నాడు నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చింది. దీంతో పాటు పౌష్టిక విలువతో కూడిన ఆహారాన్ని అందించేది. అప్పట్లో తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడులకే పంపేందుకు ఆసక్తి చూపేవారు. నిత్యావసర ధరలతో పాటు అన్ని రకాల ధరలూ ఆకాశన్నంటుతున్నాయి. ఏజెన్సీ నిర్వాహకులకు వంట భారంగా మారింది. అప్పు చేసి పిల్లలకు భోజనం చేసి పెడుతున్నా.. బిల్లులు సకాలంలో అందక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. దీంతో శుచికరమైన, నాణ్యమైన భోజనం పిల్లలకు అందడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పాత మెనూ అమలు

ప్రభుత్వం ప్రకటించిన మెనూ మేరకు సోమవారం అన్నం, పప్పుచారు. ఎగ్ కర్రీ, చిక్కి, మంగళవారం పులిహోరా, టమాటా పప్పు, గుడ్డు, బుధవారం విజిటబుల్ రైస్, ఆలూకుర్మా, గుడ్డు, చిక్కి, గురువారం కిచిడీ, పెసరపప్పు, అన్నం, టమాటా చెట్నీ, గుడ్డు, శుక్రవారం అన్నం, ఆకుకూర పప్పు, గుడ్డు, చిక్కీ, శనివారం అన్నం సాంబార్, స్వీట్, పొంగల్, పెట్టాలి. ఇందుకోసం ప్రాథమిక పాఠశాలలకు విద్యార్థికి రూ.5.88, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.8.57 దాకా నిర్వాహులకు అందిస్తున్నారు. మెనూ ధరలు గత ప్రభుత్వంలోనివే. ఈ ప్రభుత్వం ఇంకా ధరలు పెంచలేదు. కేవలం పాఠశాలల విద్యార్థులకు మాత్రం 44 పైసాలు మాత్రమే ప్రభుత్వం పెంచింది.

విద్యార్థులకు అవస్థలు

నిత్యావసర వస్తువులు, కూరగాయలు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో నిర్వాహకులకు ఖర్చులు పెరిగాయి. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు సరిపోవడం లేదు. ఫలితంగా మధ్యాహ్నం భోజనంలో నాణ్యత తగ్గింది. దీంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తినలేక అవస్థలు పడుతున్నారు. బిల్లులు రాకపోవడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు.

త్వరలో మెనూలో మార్పులు



ప్రస్తుతం మధ్యాహ్న భోజనం పథకంలో ఉన్న మెనూతో పాటు ధరలను కూడా ప్రభుత్వం త్వరలో మారుస్తున్నట్లు మాకు సమాచారం ఉంది. మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయాలని, మెనూ ప్రకారం రుచికరమైన నాణ్యమైన భోజనాన్ని తయారు చేసి పెట్టాలని అన్ని ఏజెన్సీల నిర్వాహకులకు సూచించాం.

శివప్రసాద్,
మండల విద్యాధికారి, యర్రగుంట్ల మండలం

జవాబుదారీతనం లేని బడ్జెట్

కమలాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పి. నరేన్ రామాంజులు రెడ్డి



కమలాపురం: రాష్ట్రం ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ జవాబుదారీతనం లేని బడ్జెట్ అని కమలాపురం నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ సమన్వయకర్త పీ నరేన్ రామాంజులు రెడ్డి విమర్శించారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామంటూ ప్రజలను మోసగించి అధికారాన్ని దక్కించుకున్న టీడీపీ అధికారంలోకి వచ్చిన 5 నెలల తరువాత కేవలం 4 నెలలకు బడ్జెట్ ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ బడ్జెట్‌లో సూపర్ సిక్స్ పథకాల అమలుకు అవసరమైన నిధుల కేటాయింపులు చేయక పోవడం ద్వారా వాటిని అమలు చేయబోమని ప్రజలకు సంకేతాలిచ్చినట్లయిందని పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ. 1,500 వంటి పథకాల ఊసే లేదని, కొన్నింటికి అరకొరగా నిధులు కేటాయించడం చూస్తే ఇది మళ్లీ ప్రజలను మోసగించడమేనని పేర్కొన్నారు.

సోలార్ పేరుతో బెదిరిస్తున్నారు

ఆర్డీఓకు గొర్రెల కాపరుల ఫిర్యాదు

జమ్మలమడుగు రూరల్: 'మా తాతల కాలం నుంచి గొర్రెల పోషణే జీవనాధారంగా జీవిస్తున్నాం. వందల కుటుంబాలకు జీవనాధారమైన కొండను ఇప్పుడు సోలార్ పరం చేశారు. పగలంతా గొర్రెలను ఎక్కడో ఓచోట మేపుకొని రాత్రి వాటిని పడుకోబెట్టుకోవడానికి కొండలో ఓ మూలన కొంత స్థలాన్ని వదిపెట్టమని బతిమాలుతున్నా సోలార్ ప్రాజెక్ట్ అధికారులు వినడం లేదు. ముళ్ల కంపతో చుట్టూ కంచెను ఏర్పాటు చేసుకొని రాత్రి గొర్రెలను అందులో పడుకోబెట్టుకుంటున్నాం. ఇప్పుడు ఆ ముళ్లకంచెలను సైతం తొలగిస్తామంటూ సోలార్ అధికారులు బెదిరిస్తున్నారు. ఉన్న ఫలంగా మమ్మల్ని మా మూగజీవాలను కొండ నుంచి తరిమేస్తే మాకు జీవనాధారం ఎలా మేడం?' అంటూ గొర్రెల కాపరులు జమ్మలమడుగు ఆర్డీఓను కలసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. మైలవరం మండలం వద్దిరాల గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో సమస్య పరిష్కార వేదికలో సోలార్ అధికారులపై ఫిర్యాదు చేశారు. ఎన్నో ఏళ్లగా మా ఊరి కొండలో ఓ మూలన గొర్రెల దొడ్లు ఏర్పాటు చేసుకుంటే ప్రస్తుతం వాటిని కూడా తొలగిస్తామని బెదిరిస్తున్నారని వారు వాపోయారు. 3 వేల ఎకరాల విస్తర్ణం ఉన్న కొండలో కనీసం 300 ఏకరాలను మూగజీవాల కోసం వదిలిపెట్టలేరా అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గొర్రెల కాపరుల ఆవేదనను ఓపిగ్గా విన్న ఆర్డీఓ సాయిశ్రీ త్వరలోనే స్వయంగా ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తానని చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధికి భంగం వాటిల్లకుండా గొర్రెల కాపారులకు న్యాయం చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.



ఆర్డీఓ సాయిశ్రీకు ఫిర్యాదు చేస్తున్న వద్దిరాల గొర్రెల కాపరులు

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

పులివెందుల టౌన్ : ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తల అక్రమ అరెస్టులు ప్రజాస్వామికమని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైసీపీ శ్రేణులు, సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌లక్ష్మణ్ రెడ్డి, జిల్లా కోశాధికారి రాఘవేంద్రా రెడ్డి పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలోని పాత ఎమ్మెల్యే ఆఫీస్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సూపర్ సిక్స్ హామీల అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపుతుంటే అన్యాయంగా, అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రజల తరపున ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు ఎత్తి చూపుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తొండూరు మండల యువ నాయకులు లక్ష్మారెడ్డి, మధురెడ్డి, హర్షద్, సాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌లక్ష్మణ్‌రెడ్డి తదితరులు

జీతాలివ్వండి.. ప్లీజ్

పులివెందుల రూరల్: సారు.. జీతాలివ్వండి ప్లీజ్ అని పులివెందులలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ అకాడమీలో పనిచేస్తున్న ఉద్యోగులకు, సెక్యూరిటీ సిబ్బంది వేడుకున్నారు. ఐదు నెలలుగా జీతాలు అందకపోవడంతో వీరు ఇబ్బందులు పడుతున్నారు. పులివెందుల పట్టణంలోని రింగ్ రోడ్డు సమీపంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంగా వైఎస్సార్ ఇస్తా (వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్కిల్ ట్రెనింగ్ అకాడమీ) ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటిగ్రేటెడ్ ట్రెనింగ్ అకాడమీలో సుమారు వంద మంది విద్యార్థులు ట్రెనింగ్ తీసుకునేవారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వడంలేదు. ప్రస్తుతం ఇంటిగ్రేటెడ్ స్కిల్ ట్రెనింగ్ అకాడమి నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా కూటమి సర్కార్ ఇంటిగ్రేటెడ్ స్కిల్ ట్రెనింగ్ అకాడమీలో శిక్షణా తరగతులు ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

నేడు ఉల్లాస్‌పై శిక్షణ

కమలాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మంగళవారం 10 గంటలకు మండలంలోని వెలుగు వీఓఏ, అంగన్వాడీ వర్కర్లకు ఉల్లాస్ అనే కార్యక్రమంపై శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రతి రోజు రాత్రి సమయాల్లో చదువు రాని వారికి చదువు నేర్పించడం. వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉల్లాస్ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, వెలుగు వీఓఏలకు శిక్షణ నిచ్చి వారితో 15ఏళ్ల పైబడిన నిరక్ష రాస్యులకు అక్షరాలు నేర్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సమాజంపై అవగాహన అవసరం

వల్లూరు: సమాజం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ విజయ కుమారి పేర్కొన్నారు. వల్లూరులోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కిషోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు, ఇందులో భాగంగా ఆమె బాల్య వివాహాల వలన కలిగే అనర్థాల గురించి, బాల్య వివాహ చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి చైల్డ్ యాక్ట్, పోక్సో యాక్ట్ గురించి వివరించారు.

యువత ప్రతిభ చాటాలి

కమలాపురం: యువ ఉత్సవ్–2024 పోటీల్లో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా యువత ప్రతిభ చాటాలని మండల తహసీల్దార్ శివరామిరెడ్డి ఆకాంక్షించారు. సోమవారం స్థానిక తన కార్యాలయంలో మదర్ థెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్‌తో కలసి ఆయన యువ ఉత్సవ్–2024 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీయూలో ఈ నెల 16న యువకులను ప్రోత్సహించేందుకు యువ ఉత్సవ్–2024 పోటీలు నిర్వహించడం హర్షణీయం అన్నారు. ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యువ ఉత్సవ్–2024 నిర్వహిస్తున్నామని తెలిపారు. మండల సర్వేయర్ సురేంద్రనాథ్ రెడ్డి, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ నాగన్న పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ చాంపియన్‌షిప్‌లో సత్తా

సింహాద్రిపురం : అనకాపల్లెజిల్లా నక్కపల్లె గ్రామంలో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ చాంపియన్ షిప్ అండర్–14 బాలికల విభాగంలో సింహాద్రిపురం మండలం బలపనూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎస్.డి.సునియా భాను విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థిని సునియా భాను మాట్లాడుతూ రిటైర్డ్ పీఈటీ రేణుకాదేవి, ఉపాధ్యాయుడు రామాంజనేయులు ప్రోత్సాహంతో హాకీ విజేతగా నిలిచానని పేర్కొన్నారు. విద్యార్థిని హెడ్మాస్టర్ ప్రభుదాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

హాకీ క్రీడాకారుడి ప్రతిభ

పులివెందుల టౌన్ : అనకాపల్లె జిల్లా నక్కపల్లె గ్రామంలో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ చాంపియన్ షిప్‌లో అండర్–14 బాలుర విభాగంలో పులివెందులకు చెందిన హాకీ క్రీడాకారుడు సి.జగన్‌మోహన్ జిల్లా రన్నరప్‌గా నిలిచారు. జగన్‌మోహన్‌ను పలువురు అభినందించారు.



ట్రోఫీతో సునియా భాను

సమతుల్యమైన ఆహారంతో ఆరోగ్యం

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరూ సమతుల్యమైన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఫుడ్ అండ్ సైన్స్ కళాశాల చైర్మన్ డాక్టర్ ఎం. కీర్తిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో సమతుల్యమైన ఆహారం, రోజువారీ జీవితంలో దాని ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సమత్యులమైన ఆహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి, గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మహేశ్వరరెడ్డి, కళాశాల అధ్యాపకులు రాజేష్, సాయిశ్రీనివాస్, జాకీర్ బాషా, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలు తొలగించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం, శ్రీమిట్టమల్లేశ్వర పాఠశాల గోడలపై నిర్లక్ష్యం మొక్కలై పెరుగుతుందని ఆదివారం సాక్షి పత్రికలో వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు శ్రీమిట్ట మల్లేశ్వర పాఠశాల భవనాల గోడలపై మొలిచిన మొక్కలను తొలగించారు.



పాఠశాల గోడపై ఉన్న మొక్కను తొలగించిన అధికారులు

ఘనంగా మౌలానా అబుల్ కలాం జయంతి



పులివెందుల రూరల్ : మౌలానా అబుల్ కలాం అజాద్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న పిన్సిపాల్



పులివెందుల టౌన్ : మౌలానా అబుల్ కలాం అజాద్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలలో సోమవారం భారతరత్న, తొలి విద్యా శాఖ మంత్రి డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, మౌలానా అబుల్ కలాం అజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శేష మహేశ్వరమ్మ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్క విద్యార్థి చదువుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మౌలానా అబుల్ కలాం చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్ ఖాదర్ బాషా, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సి.యోగాంజనేయులు మౌలానా అబుల్ కలాం అజాద్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఇడుపుపాయ ట్రిపుల్ ఐటీలో..

ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో జాతీయ విద్యా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా మౌలానా అబుల్ కలాం అజాద్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అకడమిక్ డీన్ రమేష్ దండుకర్, క్యాంపస్ ఆర్థిక అధికారి శ్రీమతి కోటేశ్వరి, పరీక్షల విభాగం అధ్యక్షుడు డాక్టర్ రమేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దీప్తి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కమలాపురం: తొలి కేంద్ర విద్యా శాఖ మంత్రిగా మౌలాన అబుల్ కలాం ఆజాద్ అనేక సేవలు అందించారని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా జి. వినోద్ కుమార్ కొనియాడారు. సోమవారం మౌలాన అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ఆజాద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మారుమోగిన శైవక్షేత్రాలు



చక్రాయపేట: ప్రత్యేక అలంకరణలో సిద్దేశ్వరుడు



వీరపునాయునిపల్లె: ప్రత్యేక అలంకరణలో సంగమేశ్వరుడు



వేంపల్లె : ప్రత్యేక అలంకరణలో గౌరిదేవి అమ్మవారు

సింహాద్రిపురం : 'శివ శివ శంకరా.. భక్తవ శంకరా.. బ్రహ్మమురారీ సురార్చిత లింగం.. హరహర మహాదేవ.. శంభోశంకర..' అంటూ సాగిన శివ నామస్మరణతో సోమవారం శైవక్షేత్రాలు మార్మోగాయి. మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన భానుకోట సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాస రెండవ సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులకు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకుని కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చున్నారు. అలాగే గురిజాల గురుగుట్ట ఆలయంతోపాటు మండలంలోని అన్ని శివాలయాల్లో కార్తీక మాస పూజలు ఘనంగా జరిగాయి.

కార్తీక మాస పూజలు

తొండూరు : శివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం. అందులోనూ రెండవ సోమవారం కావడంతో మహిళలు విశేష పూజలు చేశారు. తొండూరు మండలంలోని శివాలయాలకు భక్తులు చేరుకుని శివుడికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించారు. అలాగే శివాలయాల వద్ద మహిళలు పుణ్య స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు.

ప్రారంభమైన కార్తీక మహోత్సవాలు

వేంపల్లె : స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన శ్రీగౌరీదేవి ఆలయంలో కార్తీక మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్తీక మహోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు ఆలయ అర్చకులు శంకరమంచి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో కలశ స్థాపన, గౌరీ దేవి అమ్మవారి పసువు ప్రతిమను తయారుచేసి పూజలు చేశారు. అలాగే గౌరీదేవిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్లు నంబూరు కులాయప్ప, కటిక చంద్రోఖర్, మాజీ ప్రెసిడెంట్లు కొత్తూరు రెడ్డయ్య, ఆరుషేక్ష రంగయ్య, ఉపాధ్యక్షులు రామచంద్ర, ఎడాల రామా, మహిళా మండలి అధ్యక్షురాలు కొత్తూరు రత్నాలు, నిర్వాహకులు రాజారాం పాల్గొన్నారు.

సిద్దేశ్వరాలయంలో భక్తుల సందడి

చక్రాయపేట: మండలంలోని సురభి గ్రామం బండ్లయ్యగారి సమీపంలోని వైతరణీ నది ఒడ్డున వెలసిన సిద్దేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం రెండవ సోమవారం భక్తుల సందడి కనిపించింది. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు, అయ్యప్ప భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే మహాదేవపల్లె, గండి శివాలయం వద్ద కూడా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు చేశారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

ముద్దనూరు: కార్తీక మాసం రెండవ సోమవారం మండల వ్యాప్తంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో ఉదయమే శివునికి రుద్రాభిషేకం, అర్చనలతో విశేష పూజలు చేశారు. శివలింగాలను ప్రత్యేకంగా అలంకరించారు.

కార్తీక మాస పూజలు

లింగాల : కార్తీక మాస రెండవ సోమవారం కొండ, కోనల్లో వెలసిన ముక్కంటేశ్వరుడు ఘనంగా పూజలందుకున్నాడు. మండలంలోని దక్షిణ కాశీగా పేరుగాంచిన పార్నపల్లె కోన మల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కొనేటిలో స్నానమాచరించి కార్తీక దీపాలను వెలిగించి ముక్కటిని దర్శించుకున్నారు. అదే విధంగా లింగాల వనంబావి శివాలయం, అంబకపల్లె సిద్దేశ్వరస్వామి ఆలయం, బోనాల చిన్నబావి శివాలయం, కర్ణపాపాయపల్లె భూలింగేశ్వరస్వామి ఆలయం, దొండ్లవాగు, ఇప్పట్ల, మురారిచింతల తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంగమేశ్వరాలయంలో..

వీరపునాయునిపల్లె: కార్తీకమాసం రెండవ సోమవారం మండలంలోని అనిమెల సంగమేశ్వరాలయం శివనామ స్మరణతో మారుమోగింది, యన్. పాలగిరిలోని భీమేశ్వరాలయం, యు. రాజుపాలెం గ్రామంలోని రామలింగేశ్వరాలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయ అర్చకులు ఆలయాల్లోని మూలవిరాట్‌లను అత్యంత సుందరంగా అలంకరించారు. ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్తంబాల వద్ద కార్తీక దీపాలు వెలిగించారు.

పుష్పగిరిలో భక్తి శ్రద్ధలతో కార్తీక పూజలు

వల్లూరు : పవిత్ర కార్తీక మాస రెండవ సోమవారం సందర్భంగా పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో భక్తి శ్రద్ధలతో కార్తీక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెన్నానదిలో స్నానమాచరించి శ్రీ లక్ష్మీ చెన్న కేశవస్వామి, సంతాన మల్లేశ్వర, సాక్షి మల్లేశ్వర స్వామి ఆలయాలలో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. అలాగే పుష్పగిరి గ్రామంలోని వైద్యనాథ స్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. కామాక్షీ దేవి ఆలయంలో అమ్మవారికి, శ్రీ చక్రానికి కుంకుమార్చన చేశారు. త్రికుటేశ్వర స్వామి, ఉమా మహేశ్వరస్వామి, బీమేశ్వర, భీమ లింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు.

శాకంబరీ అలంకారంలో భవానీ మాత

కార్తీక మాస రెండవ సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివ పార్వతులను, వినాయకుని, నంది వాహనాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. వల్లూరులోని శ్రీ భవానీ శంకర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలను నిర్వహించారు. శ్రీ చక్ర సహిత భవానీ మాతను శాకంబరీ దేవిగా అలంకరించారు.

పొలతలకు తరలివచ్చిన భక్తులు

పెండ్లిమర్రి: పొలతల శైవక్షేత్రంలో రెండవ కార్తీక సోమవారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. ఉదయం అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి గణపతి పూజ, మహామంగళ హారతి, కుంకుమార్చన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అవరణంలో కార్తీక దీపాలు వెలిగించి, మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులి బండెన్న స్వామికి పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మల్లేశ్వరస్వామి ఊరేగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.

భక్తులతో కళకళలాడిన శివాలయాలు

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలోని శివాలయాలలో కార్తీక మాసం పురస్కరించుకొని భారీ జన సందోహాల మధ్య పూజలు, అభిషేకాలతో శివాలయాలు కళకళలాడాయి. శివాల్‌పల్లి కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, చెన్నూరు నాగేశ్వర స్వామి దేవస్థానం, పడమట వీధి శివాలయం, ఉప్పరపల్లి నాగేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.